క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. దర్గా, హౌజింగ్ బోర్డు కాలనీ, బియాబాని నగర్, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్, భీమ్‌నగర్, పీఎఫ్ కార్యాలయం రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, నగర శివారు అన్సారీ ట్రస్టు, గాయత్రినగర్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు జేఎన్ఎస్‌లో గ్రామీణ క్రీడలు

వరంగల్ స్పోర్ట్స్ / కాజీపేట: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న క్రీడా పోటీలను భారతీయ మహిళా కళాత్మక జిమ్నాస్ట్ బుద్ధ అరుణ ప్రారంభించనున్నట్లు ఈశా వలంటీర్ శిరీష తెలిపారు. మరిన్ని వివరాలకు 70324 58118, 85009 85067 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బంధువులకు మహిళ అప్పగింత



కాజీపేట అర్బన్: హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో ఒంటరిగా ఉన్న మహిళను బంధువులకు సఖి సెంటర్ సిబ్బంది అప్పగించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సఖి సెంటర్ సిబ్బంది హైమావతి కథనం ప్రకారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో గురువారం ఓ మహిళ ఒంటరిగా కూర్చుని ఉన్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి సమాచారం మేరకు అక్కడి వెళ్లి ఆ మహిళను హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని సఖి వన్‌స్టాప్ సెంటర్ కార్యాలయానికి తరలించారు. ఆమెకు తాత్కాలిక వసతి అందజేసి, కౌన్సెలింగ్ నిర్వహించగా తాను నర్సంపేటవాసిగా వివరాలు తెలపడంతో పాటు తన కూతురు భర్త ఫోన్ నంబర్ చెప్పింది. మహిళ అల్లుడికి ఫోన్ ద్వారా సమాచారం అందజేసి శుక్రవారం అప్పగించినట్లు హైమావతి వివరించారు.

డీఆర్‌డీఓ శ్రీనుకు అభినందనలు

హన్మకొండ అర్బన్: డీఆర్‌డీఓగా విధుల్లో చేసిన మేన శ్రీనును డీఆర్‌డీఓ అధికారులు, సిబ్బంది, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఉద్యోగులు, అధికారులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పెద్ది ఆంజనేయులు, జూలూరి ప్రవీణ్‌కుమార్, గండి బాబు, కూతురు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సన్మానం



కాజీపేట రూరల్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్‌ను రైల్వే ఇన్‌స్టిట్యూట్ మాజీ జాయింట్ సెక్రటరీ, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుడు పోలెపాక రాజు ఆధ్వర్యంలో పలువురు రైల్వే నాయకులు శుక్రవారం సన్మానించారు. కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ బ్రాంచ్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, సెక్రటరీ బాలమునిరాజు, జమ్మికుంట బ్రాంచ్ మజ్దూర్ యూనియన్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బ్యాడ్మింటన్ కోచ్‌ను తొలగించడం సరికాదు'

వరంగల్ స్పోర్ట్స్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ శ్రీధర్‌ను అకారణంగా తొలగించడం సరికాదని వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పింగిళి రమేష్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దశాబ్దకాలంగా ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడేలా తీర్చిదిద్దిన కోచ్ శ్రీధర్‌ను కార్పొరేషన్ అధికారులు తొలగించడంతో శిక్షణ అందించే వారులేక క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

దాస్యం వినయ్‌భాస్కర్ జన్మదిన వేడుకలు



సాక్షి నెట్‌వర్క్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కలిశారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వినయ్‌భాస్కర్ పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. భీమారం, ముచ్చర్ల గ్రామాల్లో సంబురాలు జరుపుకున్నారు. ఫాతిమానగర్‌లోని సెయింట్ ఆన్స్ ఓల్డేజ్ హోంలో అన్నదానం చేశారు. కేయూ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం కేయూ అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

ఎదురుచూపులు

- అభివృద్ధికి నోచుకోని మడికొండ జంక్షన్
- రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేసి చేతులు దులుపుకున్న అధికారులు
- నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారుల ఇక్కట్లు



అభివృద్ధికి నోచుకోని మడికొండ చౌరస్తా



మడికొండ చౌరస్తాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రుతిఓజా, అధికారులు (ఫైల్)

మడికొండ: కాజీపేట మండలం మడికొండ జాతీయ రహదారి జంక్షన్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. రహదారి విస్తరణ, కూడలి అభివృద్ధికి అధికారులు మార్కింగ్ చేసి ఊరుకున్నారు. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు, బాటసారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మార్కింగ్ చేసి వదిలేశారు

మడికొండ జంక్షన్‌ను అభివృద్ధి చేస్తామని అప్పటి మేయర్ నన్నపునేని నరేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రుతిఓజా కూడలి నిర్మాణం కోసం కొలతలు వేసి మార్కింగ్ చేయించారు. సుమారు ఏడెనిమిదేళ్లు అవుతున్నా ఇప్పటికి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రహదారిని విస్తరిస్తే తమ షాపులు ఉంటాయో ఊడుతాయోనని వ్యాపారులు అయోమయంలో ఉన్నారు. అధికారుల మార్కింగ్‌లో కొన్ని షాపులు సగం వరకు పోతుండగా మరికొన్ని దుకాణాలు, ఇళ్లు పూర్తిగా రోడ్డు విస్తరణలోకి వెళ్లనున్నాయి. ఈక్రమంలో వ్యాపారులు తమ షాపులను అభివృద్ధి చేసుకోవాలా వద్దా అనే మీమాంసంలో ఉన్నారు.

జంక్షన్‌ను అభివృద్ధి చేయాలి



జంక్షన్‌ను అభివృద్ధి చేసి బస్‌షెల్టర్ నిర్మించాలి. మడికొండ కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. దాంతో వాహనదారులు, పాదచారులకు ఇక్కట్లు తప్పడం లేదు. జంక్షలో బస్‌షెల్టర్, టాయిలెట్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- రావుల నాగరాజు, స్థానికుడు

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి



మడికొండ జంక్షన్‌ను అప్పటి మేయర్ నరేందర్, బల్దియా కమిషనర్ శ్రుతిఓజా పరిశీలించి కూడలి అభివృద్ధికి మార్కింగ్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

- దువ్వ వినయ్, స్థానికుడు

మడికొండ చౌరస్తాలో నిలిచిన వాహనాలు



చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు

మడికొండ: మడికొండలో శుక్రవారం వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన స్వాగత తోరణాన్ని తొలగించే సమయంలో ఇరువైపులా వాహనాలను నిలిపివేశారు. ఈ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోందని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, పాలకులు మడికొండ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

- టీఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

హన్మకొండ: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెల్ల మహేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామల్ల సత్యం డిమాండ్ చేశారు. తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కూడలి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. పెంచిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ సోషల్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గోవింద్ రాజు, ఈర్ల ప్రసాద్, యాదాద్రి భువనగిరి ప్రెసిడెంట్ సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ మేడి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ యన్నమల్ల ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రటరీ నిర్మల సతీష్ మహాజన్, జనరల్ సెక్రటరీ కూరెళ్ల ఉదయ్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ తాటిపాముల తరుణ్, ఆదర్శ్, విజయ్ కుమార్, హనుమకొండ జిల్లా మహిళా ఇన్‌చార్జ్ శ్రీలక్ష్మి ప్రసన్న, స్వాతి, పద్మావతి, సరళ, స్వరూప, దివ్య, రమ, పద్మ, భాగ్య, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

ఖిలా వరంగల్: పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. వరంగల్ రంగశాయిపేటలోని గవిచర్ల క్రాస్ రోడ్డు జంక్షన్‌లో ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన నిరసన ధర్నాలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపులను విడుదల చేయకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రోహిత్, సోహన్, ఇర్ఫాన్, రాజు, సుమన్, నవీన్ మోహన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

కేయూ క్యాంపస్: ఆరోగ్యమే మహాభాగ్యమని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ సురేందర్ అన్నారు. క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా విద్యార్థులు, వలంటీర్ల కోసం రాల్ ఆఫ్ యోగా ఇన్‌స్పోర్ట్స్ ఫర్‌ఫార్మెన్స్ అనే అంశంపై ఆయన శుక్రవారం మాట్లాడారు. విభాగం అధిపతి ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మమత, డాక్టర్ చంద్రశేఖర్, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

సీపీఆర్‌పై అవగాహన ఉంటే ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని గుండె వైద్య నిపుణుడు డాక్టర్ రామక శ్రీనివాస్ అన్నారు. కేయూలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో సెనెట్‌హాల్‌లో ఉద్యోగులు, విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు.

సామాజిక సేవలో విద్యుత్ ఉద్యోగులు

- టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ వరుణ్ రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యుత్ ఉద్యోగులు పాల్గొనడం అభినందనీయమని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీని విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర, ఎన్పీడీసీఎల్ కంపెనీ నాయకులు కలిశారు. విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి చొరవ తీసుకుని, కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి అంజయ్య, ఇన్‌చార్జ్ డైరెక్టర్ వి.తిరుపతిరెడ్డి, నాయకుడు షరీఫ్‌లు కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళంగా అందించారు. విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు వి.వేణు బాబు, సెక్రటరీ ఎం.సుదర్శన్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఉపేందర్, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే బంగారు భవిష్యత్



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న రవి

- వరంగల్ అడిషనల్ డీసీపీ రవి

విద్యారణ్యపురి: విద్యార్థినులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని వరంగల్ అడిషనల్ డీసీపీ రవి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో బాటనీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరగనున్న జాతీయ సదస్సులో శుక్రవారం రీసెంట్ అడ్వాన్స్ ఇన్ ప్లాంటేషన్ రీసెర్చ్ అనే అంశంపై రవి మాట్లాడారు. విద్యార్థినులు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా తమ చదువును కొనసాగించాలని సూచించారు. కేయూ బాటనీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ముస్తఫా, డాక్టర్ సునీత, కేయూ బాటనీ విభాగం అధిపతి ప్రొఫెసర్ లలితాకుమారి, పింగిళి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ, అధ్యాపకులు శ్రీలత, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

అంతరాయం కలగకుండా ముందుజాగ్రత్తలు



సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎస్ఈ, అధికారులు

హన్మకొండ: వచ్చే వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగి అంతరాయం ఏర్పడకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటరమణ అన్నారు. హనుమకొండ యాదవనగర్ సబ్ స్టేషన్ సామర్థ్యం పెంపులో భాగంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. వినియోగదారులకు ఏమైనా సమస్యలుంటే 1912 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, ఎమ్మార్టీ, కన్‌స్ట్రక్షన్ డీఈ దర్శన్ కుమార్, ఏడీ జానకిరాం రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ప్రిన్సిపాల్ అరుణ



మొక్క నాటుతున్న కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి

రామన్నపేట: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు అన్నారు. నగరంలోని ఎల్‌బీ కళాశాలలోని ఎన్‌సీసీ పదో తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు ఎన్‌సీసీ డే వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 24న ఎన్‌సీసీ డేను పురస్కరించుకొని ఎన్‌సీసీ అధికారుల పిలుపు మేరకు కళాశాల ఆవరణలో పలు రకాల ఔషధ మొక్కలను శుక్రవారం నాటినట్లు ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో హరితహారం

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 10వ బెటాలియన్ ఫోర్ టీ ఎయిర్ ఎన్‌సీసీ, 8వ టీ గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా హరితహారం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి పాల్గొని మొక్కలు నాటి మాట్లాడుతూ పర్యావరణ పరరక్షణ అందరి బాధ్యత అని గుర్తుచేశారు. ఎన్‌సీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'వన భోజనాలను జయప్రదం చేయండి'

ఖిలా వరంగల్: గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (గోపా) వరంగల్, హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఈనెల 24న మధ్యకోట ఏకశిల చిల్డ్రన్ పార్కులో నిర్వహించనున్న కార్తీకమాస వనభోజన మహోత్సవాలను విజయవంతం చేయాలని గోపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, మండ వెంకన్న పిలుపునిచ్చారు. ఈమేరకు ఖిలా వరంగల్ ఏకశిల చిల్డ్రన్ పార్కులో గోపా జిల్లా ప్రతినిధులతో కలిసి వారు స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు.

వనభోజన ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కాజీపేట: ఈనెల 24న హనుమకొండ వన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న కార్తీక వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట పట్టణంలో శుక్రవారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. గోపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిర్ర రాజుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనంతుల రమేష్ గౌడ్, నాళం ఆనంద్ గౌడ్, గొని సాంబయ్య, సమ్మెట హరీష్ గౌడ్, బుర్ర శ్రీనివాస్, ఎం.విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

24న ఆర్యవైశ్యుల వన మహోత్సవం

వరంగల్ చౌరస్తా: వరంగల్ కోటిలింగాల దేవాలయ ఆవరణలో ఈనెల 24న జరగనున్న కార్తీక మాస వనమహోత్సవ కార్యక్రమాన్ని ఆర్యవైశ్యులు విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేంద్ర బాబు, కోశాధికారి శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

ఖిలా వరంగల్ వాకర్స్ గ్రౌండ్‌లో..

ఖిలా వరంగల్ కోట వాకర్స్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించనున్న దీపోత్సవం, వన భోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పద్మశాలి సంఘ గౌరవ సలహాదారు సతీష్ నేత కోరారు.

సంక్షిప్తంగా

కాళోజీ కళాక్షేత్రం అద్భుతం

వరంగల్ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాకే తలమానికంగా కాళోజీ కళాక్షేత్రం నిలుస్తుందని, అద్భుతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన బల్దియా కమిషనర్, 'కుడా' వైస్ చైర్మన్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేకు రాష్ట్ర నాటక సంఘం సమాఖ్య సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆమెను సమాఖ్య సభ్యులు శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

ప్రచారంలో టీఎస్ఎస్ పాత్ర కీలకం

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రచారం చేయడంలో తెలంగాణ సాంస్కృతిక సారథి (టీఎస్ఎస్) కళాకారుల పాత్ర కీలకమని 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమార్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ కళాజాత కార్యక్రమంలో భాగంగా దేశాయిపేట, కొత్తవాడ, పాపయ్యపేట చమన్ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు.

సామాజిక పింఛన్లు పెంచి ఇవ్వాలి

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛన్లను ప్రభుత్వం పెంచాలని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి.

యూఎస్ఎఫ్ఐ సభలను విజయవంతం చేయాలి

విద్యారణ్యపురి: డిసెంబర్ 14, 15వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహించనున్న భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాజేష్‌నాయక్ కోరారు. ఈమేరకు హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి

కేయూ క్యాంపస్: ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. కళాశాలలో మెడికవర్, శరత్ కంటి ఆస్పత్రి మెడికల్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

నిప్పుకోడి బ్యాచ్‌పై చర్యలు తీసుకోవాలి

వరంగల్: నిత్యం ప్రజల కోసం శ్రమిస్తున్న కొండా దంపతులపై ఎక్స్(ట్విట్టర్)లో అభ్యంతరకరమైన పోస్టింగ్‌లు పెడుతున్న కేటీఆర్ అండ్ కో బ్యాచ్‌తో పాటు నిప్పుకోడి అనే సంస్థపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు దాసరి రాజేష్, కూచన రవీందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ షుకూర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

సీఐని కలిసిన బొడ్రాయి కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నంను పడమరకోట బొడ్రాయి ఉత్సవ కమిటీ ప్రతినిధులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న గ్రామ దేవత బొడ్రాయి ఉత్సవాలకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు.

ధర్నాను జయప్రదం చేయాలి

న్యూశాయంపేట: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ హనుమకొండ కలెక్టరేట్ ఈనెల 26న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు.

నాగ్‌పూర్‌లో జనరల్ బాడీ సమావేశం

కాజీపేట రూరల్: ఈనెల 25, 26వ తేదీల్లో నాగ్‌పూర్‌లో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ సెంట్రల్ అన్యువల్ కన్వెన్షన్, అన్యువల్ జనరల్ బాడీ సమావేశం జరగనుందని సంఘం డివిజన్ నాయకులు బి.వీరన్న, కేఎస్.రావు, ఎస్.హరిబాబు తెలిపారు. ఈమేరకు కాజీపేట జంక్షన్ పరిధిలోని అన్ని బ్రాంచీల నాయకులు తరలిరావాలని వారు కోరారు.

కామన్ స్కూల్ విద్యావిధానానికి ఉద్యమం

విద్యారణ్యపురి: కామన్ స్కూల్ విద్యావిధానం ప్రవేశపెట్టాలని ఉపాధ్యాయులు ఉద్యమించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. జిల్లాస్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు బత్తిని రామాంజనేయులు అధ్యక్షతన వర్చువల్ పద్ధతిలో శుక్రవారం నిర్వహించారు.

భద్రకాళి దేవాలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ ఐజీ ఆరోమాసింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా శుక్రవారం సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

హసన్‌పర్తి: రాజ్యాంగాన్ని మనువాదుల చెర నుంచి రక్షించుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26 నుంచి జనవరి 26వ తేదీ వరకు డీబీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రచారోద్యమ కార్యక్రమాన్ని వంగపహాడ్‌లో ప్రారంభించారు.

ఎల్‌బీనగర్ ప్రభుత్వ పాఠశాలలో గ్యాస్ లీక్

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి పాఠశాలలో గురువారం రాత్రి గ్యాస్ లీక్ అయింది. దాంతో చుట్టుపక్కల వారు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పాఠశాల సిబ్బంది, వంట మనిషులు పాఠశాలకు చేరుకుని సిలిండర్‌ను ఆఫ్ చేశారు.

యువకుడిపై దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

వరంగల్: వరంగల్ మండిబజార్‌లోని వసీం టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేస్తున్న లాదెళ్ల రాజేష్‌పై దాడి చేసిన కేసులో టిఫిన్ సెంటర్‌లో పనిచేసే ముగ్గురు వర్కర్లపై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జనవిజ్ఞాన వేదిక పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: జీవ పరిణామ సిద్ధాంతం ఆరిజన్ ఆఫ్ స్పెసీస్ ప్రచురణ సందర్భంగా సంబంధిత పోస్టర్‌ను వీసీ ప్రతాప్‌రెడ్డితో కలిసి హనుమకొండ జన విజ్ఞాన వేదిక బాధ్యులు ఆవిష్కరించారు.

ఎమ్మెల్యే నాయినికి టీఎన్జీఓస్ అభినందనలు



హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా టీఎన్జీఓస్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ జిల్లాకు జిల్లా కేంద్రంలో రూ.90 కోట్ల వ్యయంతో అద్భుతంగా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం ముఖ్యమంత్రి ప్రారంభించే విధంగా కృషి చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బైరి సోమయ్య, సహాధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, రాము, లక్ష్మీప్రసాద్, సురేష్, శ్రీనివాస్, పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.